వనమహోత్సవానికి సర్వం సిద్ధం

- నర్సరీలపై అధికారుల పర్యవేక్షణ
- ఇంటింటికి మొక్కల పంపిణీకి చర్యలు

లింగాల: అడవుల విస్తరణకు, గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం వనమహోత్సవానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతోంది. అధికారుల మొక్కల సంరక్షణకు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీల నిర్వహణ కొనసాగుతోంది. ప్ర తి గ్రామ పంచాయతీలో ఒక్కో నర్సరీ చొప్పున ఏర్పాటు చేసిన అధికారులు ఆయా నర్సరీలలో మొత్తం 1,54,720 మొక్కలను పెంచుతున్నారు. 2025–26కు గాను పంచాయతీల వారిగా ఒక్కో నర్సరీలో 5 వేల నుంచి 10 వేల మొక్కల వరకు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు.

నర్సరీలలో మొక్కల రకాలు

మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో ఏ ర్పాటు చేసిన నర్సరీలలో పలు రకాల మొక్కల ను పెంచుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో నీడనిచ్చే చెట్లతో పాటు గుల్మార్, ఈ త, తంగెడు, ఖజూర, గన్నేరు, జామ, బాదం, మునగ, కానుగ, తదితర రకాల మొక్కలు ఉన్నాయి.



అవుసలికుంట నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపు

మొక్కలు నాటేందుకు అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బంజరు భూములు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర ప్రాంతాలలో మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఇంటికి పండ్ల మొక్కలు పంపిణీ చేస్తామని ఏపీఓ ఇమాంఅలీ తెలిపారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం



ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మొక్కలు నాటుతాం. జూలైలో వనహోత్సవంలో అన్ని శాఖల భాగస్వామ్యంతో చేపడుతాం. అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల పాల్గొని విజయవంతం చేయాలి.

– చంద్రశేఖర్, ఎంపీడీఓ, లింగాల

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో మార్కెట్ యార్డుకు దగ్గర హైదరాబాద్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ డిపోకు వస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు అదుపుతప్పి రోడ్డు దిగి గుంతలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో బ్రేక్ వేసి ప్రమాదాన్ని నివారించారు. అందులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అంటరానితనాన్ని అరికట్టాలి



నాగర్‌కర్నూల్ రూరల్: గ్రామాల్లో అంటరానితనాన్ని అరికట్టాలని కొమ్ము భరత్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూఢనమ్మకాలు, చేతబడుల పేరుతో రోజు రోజుకు దళితులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంటరానితనం నిర్మూలన కోసం చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన దళితులందరికీ రాజీవ్‌యువ వికాసం అమలు చేయాలన్నారు. నాయకులు లక్ష్మీపతి, శివశంకర్, ఉషన్న, లక్ష్మణ్, కృష్ణయ్య, మైసన్న, మహేష్, బంగారయ్య, అభిరామ్, బహగుణ, అరవింద్, అర్జున్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదబీమా మంజూరు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలి చిట్టెమ్మ కుటుంబానికి ప్రమాదబీమా కింద రూ.10 లక్షలు మంజూరు అయినట్లు శ్రీనిధి మేనేజర్ విక్రమ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘం సభ్యులకు రుణబీమా, ప్రమాద బీమా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత




వెల్దండ: మండలంలోని దుబ్బతండాకు చెందిన వడ్త్యావత్ మౌనికకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.26 వేలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో దుబ్బతండా శ్రీను నాయక్, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి

చారకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ మండల నాయకుడు మోగిళ్ల కన్నా ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జూనియర్ కళాశాల లేకపోవడంతో పేదలు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని వాపోయారు. 30 కిలోమీటర్ల వరకు కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందించి జూనియర్ కళాశాల మంజూరుకు కృషి చేయాలని కోరారు.

కొలువుదీరిన పీర్లు



లింగాల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పీర్లు కొలువుదీరాయి. రెండు రోజుల కిందట చంద్రుడు కనిపించడంతో సవార్లను(పీర్లను) అందంగా అలంకరించి చావిళ్లలో నిలబెట్టారు. అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. అంబట్‌పల్లిలో మహిళలు బొడ్డెమ్మలు ఆడుతూ సందడి చేశారు. యువకులు అలయ్ బలయ్ ఆడారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

పెద్దకొత్తపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహను ఆదివారం మండల కేంద్రంలో వాసవీమాత చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బాలస్వామి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శంకరయ్యలు సన్మానించారు. కార్యక్రమంలో రాంబాబు, సుధాకర్, యాదగిరి, సుధాకర్, జగదీశ్, శ్రీధర్, శివయ్య పాల్గొన్నారు.

అసంపూర్తిగా తరగతి గదులు

పెద్దకొత్తపల్లి: కల్వకోలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు గాను 105 మంది విద్యార్థులు ఉన్నారు. 2 గదులు మాత్రమే ఉన్నాయి. మూడు తరగతులను చెట్ల కింద, వరండాల్లో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు అదనపు గదులను మంజూరుచేసింది. గదుల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు నిధులు రాకపోవడంతో మధ్యలోనే నిర్మాణాలను వదిలివేశాడు. దీంతో అసంపూర్తిగా గదులు దర్శనమిస్తున్నాయి. బండలు, కిటికీలు, తలుపులు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తే గదుల కొరత తీరుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఎంఈఓ శ్రీనివాసురెడ్డిని వివరణ కోరగా నిధుల మంజూరు కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.



కల్వకోలులో అసంపూర్తిగా ఉన్న అదనపు గదులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన బైక్ మెకానిక్ మాడిశెట్టి బాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని మిత్ర ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రసూల్ ఖాన్, జగన్, అంజి గౌడ్, శ్రీకాంత్ నేత, వినిల్, శ్రీకాంత్, హలీం తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో ఆర్థికసాయం అందిస్తున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు

గంగపుత్ర యువసేన సంఘం ఆధ్వర్యంలో..

వెల్దండ: మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన చెర్కొ కిష్టమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం గంగపుత్ర యువసేన సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘం సభ్యులు చందాలు వేసుకొని మొత్తం రూ.23వేల ఆర్థికసాయం అందజేశారు. సందీప్, రమేష్, బిక్షపతి, భాస్కర్, శశికాంత్, లింగేశ్వర్, సాయిలు, పరశురాములు, కృష్ణయ్య, బాలయ్య, శ్రీను, రవి, బాలకృష్ణ, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

అంతయ్య స్ఫూర్తితో పోరాడుతాం

నాగర్‌కర్నూల్ రూరల్: డీవైఎఫ్ఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి అంతయ్య స్ఫూర్తితో యువజన సమస్యలపై ఉద్యమిస్తామని జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం అంతయ్య 33వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం అంతయ్య నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా నాయకులు మల్లికార్జున్, రాము, శివ, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారంలో ఆదివారం అంతయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అంతయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, నిర్మల, శివకుమార్, పర్వతాలు, సైదులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

పాండురంగారెడ్డి సేవలు మరువలేనివి



వంగూరు: మండల కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షులు పాండురంగారెడ్డి సేవలు మరువలేనివి అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మిట్టసదగోడులో నిర్వహించిన పాండురంగారెడ్డి సంతాప సభకు ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై నివాళులర్పించి మాట్లాడారు. 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ నిబద్ధత కల నాయకుడిగా ఎదిగి నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉన్న నాయకుడు పాండురంగారెడ్డి మరణం కుటుంబానికే కాకుండా కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు, సీనియర్ నాయకులు అల్వాల్ రెడ్డి, రమేష్‌గౌడ్, క్యామ మల్లయ్య, కృష్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి



వెల్దండ: మండల కేంద్రంలోని లోవోల్టేజీ విద్యుత్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ జానకిరాం నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నల్లాల బావి వద్ద 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి అన్‌ఆఫ్‌స్విచ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న స్తంభాలు, తుప్పు పట్టిన ఐరన్ స్తంభాలను తొలగించి పెద్ద స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. రాంనగర్ కాలనీలో నూతనంగా మరో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మరో వారం రోజుల్లో పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో లైన్‌మెన్ లక్ష్మణ్‌నాయక్, సిబ్బంది గిరి, రాజు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు అర్థరహితం



తిమ్మాజిపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అర్థరహితమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల మాజీ అధ్యక్షుడు ఉస్మాన్, డైరెక్టర్ మాధవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా ఎమ్మెల్యే వంశీకృష్ణ చర్యలు తీసుకున్నారన్నార. రుణమాఫీ, ఇళ్ల నిర్మాణాలపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడే అర్హత లేదన్నారు. ఉనికి కోసం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తూ చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో లక్ష్మీనారాయణ, హర్షవర్ధన్‌రెడ్డి, దేవస్వామి, నాగసాయిలు, శ్రీకాంత్‌రెడ్డి, జమీర్, మల్లయ్య, రాఘవేందర్, బంగారు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీజీ జీవితం స్ఫూర్తిదాయకం



పెద్దకొత్తపల్లి: గాంధీజీ జీవితం స్ఫూర్తిదాయకమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండు నర్సింహ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలు సాధిద్దామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శంకరయ్య, వాసవిమాత చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బాలస్వామి, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: నాయినిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. రైతులు వానాకాలం సాగుచేసిన పంటలు బాగా పండాలని మైసమ్మ దేవతకు మొక్కులు చెల్లించేందుకు బారులు తీరారు. పెబ్బేర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాల్లో తరలివచ్చారు. ఆదివారం 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఎండోమెంట్ అధికారి రామేశ్వరశర్మ తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. టీఎన్జీఓ నాయకులు గణేష్, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు చాపల గోపి, చిన్నంబావి బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కొల్లాపూర్ ఇటుకబట్టిల యాజమానుల సంఘం అధ్యక్షులు బోరెల్లి సంగేం మాదిగ తదితరులు మద్దతు తెలిపారు. దీక్షలో కూర్చున్న వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తాటికొండ కృష్ణ, చక్కర రామచంద్రం, మల్లికార్జున, జలకం మద్దిలేటి, కురుమయ్య, స్వామి, గోవిందు, సురేందర్, భాను ప్రకాష్, ఉన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



కల్వకుర్తి రూరల్: బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్‌లు అన్నారు. ఆదివారం పట్టణ ఉపాధ్యక్షుడు అభిగౌడ్ నివాసంలో బీజేపీ నాయకులు ప్రధాని మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.105 బూత్ నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. దేశాన్ని ప్రపంచంలో నాలుగవ ఆర్థిక శక్తిగా నిలిపిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్ గౌడ్, నరసింహ, గంగాధర్, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

మీడియాపై దాడి అప్రజాస్వామికం



అచ్చంపేట రూరల్: మీడియాపై దాడి అప్రజాస్వామికమని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని నేషనల్ బాంక్వెట్ హాలులో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ముఖ్య నాయకుల విస్తృత సమావేశాన్ని డివిజన్ అధ్యక్షుడు రేసోజు సాయిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మధుగౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఓ చానల్ కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ఓ చానల్ కార్యాలయంపై దాడి చేసి వాహనాలను ధ్వంసం చేయడం దురదృష్టకరమన్నారు. దాడికి పాల్పడ్డ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 8న జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు జర్నలిస్ట్ స్వేచ్ఛ మృతికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సుదర్శన్‌రెడ్డి, రాములు, కంచర్ల శ్యాంసుందర్, కర్ణయ్య, సాయిబాబు, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రతి తండాకు సురక్షితమైన తాగునీరు అందిస్తాం

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలోని ప్రతి గిరిజన తండాకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సురక్షితమైన తాగునీరు అందిస్తామని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్ర బిక్య తండాలో రూ.1,50,000తో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరిస్తామన్నారు. కానుగుబావి తండాలో నిర్మించే తుల్జా భవాని మాత దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో రాములు, రాజశేఖర్, కృష్ణ, బిచ్య, హనుమంతు, రాములు, భాస్కర్, వినోద్, ఆలయ కమిటీ సభ్యులు నర్సింగ్, దేవుల, రఘు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి అందిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

గురుకుల కార్యదర్శిని తొలగించాలి

తిమ్మాజిపేట: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి అలుగి వర్షిణిని ఆ పదవి నుంచి తొలగించాలని స్వేరో నెట్‌వర్క్ నాగర్‌కర్నూల్ జిల్లా కో కన్వీనర్ గిద్ద విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పూర్వ విద్యార్థులతో కలిసి మాట్లాడారు. గురుకుల పాఠశాల ప్రవేశాలలో అవకతవకలు అధికం అయ్యాయని ఆరోపించారు. 5వ తరగతి విద్యార్థులను ఏ ప్రాతిపాదికన ఎంపిక చేసి తీసుకుంటున్నారో ఎవరికి అంతుపట్టడం లేదని విమర్శించారు. అదేవిధంగా 6 నుంచి 9వ తరగతి వరకు సీట్ల భర్తీ విషయంలో గందగోళంగా మారిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విద్యార్థులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర జిల్లాల విద్యార్థులకు సీట్లు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లి గ్రామ లక్ష్మీ నర్సింహ ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ నిధులు దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్(సీజీఎఫ్) కమిటీ ఆమోదం ద్వారా, దేవాదాయ శాఖ మంత్రి ఆమోదంతో, మంత్రి జూపల్లి కృషితో మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆదమరిస్తే... అంతే సంగతులు!

బల్మూర్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిపై ఉన్న డ్రైయినేజీ స్లాబ్ సీకులు తేలి రంధ్రం పడటంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా రాకపోకలు సాగించే ఈ రహదారిపై రంధ్రం పడి ఏడాది కావొస్తోంది. పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళలో కొందరు ప్రమాదాలబారిన పడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. అయినా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు ఉండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంకర తేలిన రోడ్డుతో అవస్థలు



తాడూరు: మండలంలోని మేడిపూరు నుంచి అకునెల్లికుదురు, నాగదేవపల్లి, అంతారం, గోవిందాయపల్లి మీదుగా బలాన్‌పల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై కంకరతేలడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయంగా మారడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రహదారి గుండా వెళ్లే బస్సులను అధికారులు నిలిపివేశారు. దీంతో వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు కాలి నడకే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు రోడ్డును పరిశీలించి మరమ్మతు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిర్వాసితులకు సీబీఎం ట్రస్టు చేయూత

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రా స్వామి దేవాలయ స్థలంలో అక్రమ నిర్మాణాలని హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 19న దేవాదాయ శాఖ పోలీస్ పహారా మధ్య ఇళ్లను కూల్చారు. దీంతో 40 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సీబీఎం ట్రస్టు నిర్వాసితులకు అండగా నిలిచింది. సీబీఎం చైర్‌పర్సన్ చిక్కుడు అనురాధ ఆదివారం నిర్వాసితులను పరామర్శించి, కూల్చిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం 25 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులతో పాటు, దుప్పట్లు, ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమలో మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు జమ్మింకింది బాల్‌రాం గౌడ్, మహిళ అధ్యక్షురాలు ముత్యాలమ్మ, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జైపాల్, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్ గౌడ్, మాజీ సర్పంచ్ ప్రశాంత్ నాయక్, నాయకులు నర్సింహ్మారెడ్డి, రూప్ సింగ్, సందీప్‌రెడ్డి, రమేష్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, దశరథం, సిద్ధు, రమణ, శంకర్, చెన్నయ్య, నరేష్, రవితేజ తదితరులు ఉన్నారు.



బియ్యం అందిస్తున్న అనురాధ

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా గ్రంథాలయం



బల్మూర్ శాఖ గ్రంథాలయం

బల్మూర్: మండల కేంద్రంలోని గ్రంథాలయం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. గ్రంథాలయం భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఆవరణంలోకి పశువులు, మేకలు, విషపురుగులు ప్రవేశిస్తున్నాయి. దీంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ కొందరు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుగా మార్చుకున్నారు. కుక్కలు, పందులు పరిసరాలను అపరిశుభ్రం చేయడంతో పాఠకులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం వచ్చే ఆయా గ్రామాల ప్రజలు మూత్రవిసర్జన చేస్తున్నారు. గ్రంథాలయంలో విద్యుత్ సౌకర్యం కూడా లేక పోవడంతో చీకట్లో పఠనం ఇబ్బందిగా మారిందని పాఠకులు వాపోతున్నారు. ఉన్నగది కూడా ఇరుకుగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తుననారు. అధికారులు, పాలకులు స్పందించి గ్రంథాలయం చుట్టు ప్రహరీతో పాటు అదనపు గది నిర్మించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.